ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.8, కనిష్ఠం 19.6
కామారెడ్డి
జిల్లా వార్తలు
5
గురువారం 5 డిసెంబరు 2024





కొయ్యగుట్ట గురుకుల పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొయ్యగుట్ట గురుకులం ముట్టడికి బీఆర్ఎస్ నాయకుల యత్నం

- ఓయూ జేఏసీ వ్యవస్థాపకుడు రాజారామ్ యాదవ్‌తో పాటు బీఆర్ఎస్ నాయకుల అరెస్టు

బాన్సువాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశానుసారం గురుకుల పాఠశాలల్లో విద్యార్థినులు మధ్యాహ్న భోజనం వికటించి ఆసుపత్రుల పాలవడం, మరణించడం లాంటి సంఘటనలు రాష్ట్రంలో చోటు చేసుకుంటున్నాయి. దీనికి బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రంలో ప్రతీ గురుకుల పాఠశాలను తనిఖీలు చేపట్టి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేవిధంగా కృషి చేసే విధంగా బీఆర్ఎస్ నాయకులు తనిఖీలు చేపట్టాలనే ఆదేశంతో బుధవారం బాన్సువాడ కొయ్యగుట్ట గురుకుల పాఠశాల ముట్టడికి ఓయూ జేఏసీ వ్యవస్థాపకుడు రాజారామ్ యాదవ్‌తో పాటు బాన్సువాడ బీఆర్ఎస్ నాయకులు పాఠశాలకు వెళ్లారు. దీంతో పాఠశాల ప్రిన్సిపాల్ అనుమతి ఇవ్వకపోవడంతో గురుకుల పాఠశాల ముందు ధర్నా చేపట్టారు. అనంతరం బాన్సువాడ పోలీసులు వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రాజారాం యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో గురుకుల పాఠశాల విద్యార్థులకు నాణ్యతలేని భోజనం వడ్డించి వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా గురుకుల పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు పోష్టికాహారం కలిగిన భోజనాన్ని విద్యార్థులకు అందించి న్యాయం చేయాలని లేనియెడల పోరాడుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జుబేర్, నాయకులు మోచి గణేష్, మహేష్, శ్రీకాంత్, శివ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసుగు చెందారు

- ఓయూ జేఏసీ వ్యవస్థాపకుడు రాజారామ్ యాదవ్

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం లోపే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాజారాం యాదవ్ అన్నారు. బుధవారం బాన్సువాడ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యోగాలకు నోటిఫికేషన్‌లు ఇస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియామక పత్రాలు ఇస్తూ తానే ఉద్యోగాలను ఇస్తున్నానని ప్రజలను మభ్యపెట్టేప్రయత్నం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని రైతు భరోసా, వ్యవసాయ కూలీలు, మహిళలకు 2,500 నిరుద్యోగ భృతి అందిస్తామని చెప్పి ప్రజలకు నమ్మించి మోసం చేసిన ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకుని ప్రతి ఒక్కరూ ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నాయకులు మోచి గణేష్, శివ, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



బాన్సువాడలో మాట్లాడుతున్న రాజారామ్ యాదవ్



ఎల్ఆర్ఎస్‌కు.. స్పందన కరువు!

- జిల్లాలో నత్తనడకన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన
- రెగ్యులరైజేషన్ చేసుకునేందుకు ముందుకు రాని దరఖాస్తుదారులు
- కమిటీలు వేసి నాలుగు నెలలు అవుతున్నా ముందుకు సాగని ప్రక్రియ
- మూడు మున్సిపాలిటీల్లో 19 వేలకు పైగా దరఖాస్తులు
- ఇప్పటి వరకు మొత్తం 5 వేల దరఖాస్తుల పరిష్కారం

కామారెడ్డి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపాల్టీలతో పాటు ఆయా గ్రామ పంచాయతీల్లో ఎల్ఆర్ఎస్ (లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)కు స్పందన కరువవుతోంది. ఓవైపు దరఖాస్తుదారులు ఎల్ఆర్ఎస్ చేయించుకునేందుకు ఆసక్తి చూపకపోవడం, దరఖాస్తులను పరిశీలించడంలో ఆయా శాఖల అధికారులు తీవ్ర జాప్యం చేయడంతో ఎల్ఆర్ఎస్ నత్తనడకన కొనసాగుతోంది. దరఖాస్తుల పరిశీలన కోసం ప్రభుత్వం కమిటీలు వేసి నాలుగు నెలలు అవుతున్నా ఆశించిన ఫలితం కనిపించడం లేదు. మున్సిపాల్టీల్లో భారీగా దరఖాస్తులు వచ్చిన వాటిని పరిష్కరించడంలో తీవ్ర జాప్యం నెలకొంటుంది. దరఖాస్తుదారులకు నోటీసులు ఇచ్చి తదుపరి చర్యలు చేపట్టడంలో యంత్రాంగం వెనకబడుతోంది. సరిపడ సిబ్బంది లేకపోవడం, ప్రభుత్వం కులగణన సర్వేకు సంబంధించి సిబ్బందిని వినియోగిస్తుండడంతో నత్తనడకన పరిశీలన కొనసాగుతోంది. ఆగస్టు నెలలో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ మొదలైన మున్సిపాలిటీల్లో ఇంత వరకు 12 శాతం మాత్రమే క్రమబద్ధీకరించడం గమనార్హం.

22 వేలకు పైగా దరఖాస్తులు

అనధికారిక లేఅవుట్‌లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం 2020 ఆగస్టులో ఎల్ఆర్ఎస్‌ను తీసుకువచ్చింది. దీనికి జిల్లా ప్రజల నుంచి మంచి స్పందనే వచ్చింది. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపాల్టీల్లో మొత్తం 19,894 దరఖాస్తులు రాగా గ్రామ పంచాయతీ పరిధిలో మరో 2 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. గత ప్రభుత్వంలో ఎల్ఆర్ఎస్‌కు రూ.1000 చొప్పున ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కొన్ని కారణాలతో ఆ స్కీం పక్కన పెట్టింది. తాజాగా ప్రభుత్వం ఆగస్టులో రెగ్యులరైజేషన్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో నాలుగు నెలలుగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకు కమిటీలు వేసినప్పటికీ ప్రక్రియ మాత్రం ముందుకు సాగడం లేదు. మూడు మున్సిపాల్టీల్లో 19,894 దరఖాస్తులు రాగా ఇందులో 4,955 దరఖాస్తులను మాత్రమే ఇప్పటి వరకు పరిష్కరించారు. 7వేల 613 దరఖాస్తులను పరిశీలించారు. 717 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. గ్రామ పంచాయతీ పరిధిలో మరో 40 దరఖాస్తులు పరిష్కరించారు. దరఖాస్తులను పరిశీలించి అన్ని సక్రమంగా ఉన్న వాటిని క్రమబద్ధీకరించడంలోనూ ఆలస్యం తప్పడం లేదు.

మున్సిపాల్టీల వారీగా ఇలా..

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపాల్టీల్లో మొత్తం 19,894 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయి. వీటి పరిశీలన ప్రక్రియ నాలుగు నెలల నుంచి కొనసాగుతోంది. మున్సిపాల్టీల్లోనూ నాన్ లేఅవుట్ ప్లాట్లను లే అవుట్ చేసుకునేందుకు దరఖాస్తుదారులు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. కామారెడ్డి మున్సిపాలిటీలో మొత్తం దరఖాస్తులు 17,613 రాగా ఇందులో 5,474 దరఖాస్తులను పరిశీలించారు. వీటిలో 4,906 దరఖాస్తులు పరిష్కరించారు. 563 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను తిరస్కరించారు. బాన్సువాడ మున్సిపాలిటీలో మొత్తం 1874 దరఖాస్తులు రాగా ఇందులో 1194 పరిశీలించారు. 39 దరకాస్తులను మాత్రమే పరిష్కరించారు. 3 దరఖాస్తులను తిరస్కరించారు. ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలో 907 దరఖాస్తులు రాగా ఇందులో పరిశీలించినవి 502, పరిష్కరించినవి 10, తిరస్కరించినవి 120 దరఖాస్తులు ఉన్నాయి.

దరఖాస్తులు పరిశీలించడంలో ఆలస్యం

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలతో పాటు గ్రామ పంచాయతీల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రధానంగా ఆయా మున్సిపాలటీల్లో దరఖాస్తుల పరిశీలనకు కమిటీలు వేసినప్పటికీ సంబంధితశాఖ అధికారులు, సిబ్బంది వెనుకబడుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం టౌన్ ప్లానింగ్ విభాగంలో సరైన సిబ్బందిని భర్తీ చేయకపోవడం, ఉన్న సిబ్బందిని కులగణనకు సంబంధించిన వ్యవహారాల్లో ఉపయోగించుకోవడంతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన నత్తనడకన కొనసాగుతోంది. ప్రధానంగా దరఖాస్తుదారుడు కొనుగోలు చేసిన స్థలం పట్టా, ప్రభుత్వ భూమి లేదా ఏదైన చెరువా, కుంట, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉందా అనే అంశాలతో పాటు ఆ ప్లాట్లకు సంబంధించిన లింక్ డాక్యుమెంట్‌లను మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు క్షుణంగా పరిశీలించి ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ ప్రారంభించి సుమారు 4 నెలలు కావడంతో ఇప్పటికే సగానికి పైగా దరఖాస్తులు ఓపెన్ ప్లాట్లను ఇతరులకు విక్రయించినట్లుగా తెలుస్తోంది. మరికొందరు ఇళ్ల నిర్మాణాలు కూడా చేపట్టారు. జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు చేసుకున్న ఓపెన్ ప్లాట్లలో ఇళ్ల దర్శనం ఇస్తున్నాయి. దీంతో రాష్ట్రప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న ఆదాయం రావడం అనుమానమే అంటున్నారు.

ఇప్పటి వరకు రూ.3.28 కోట్లు మాత్రమే

జిల్లాలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల రూపేనా సుమారు రూ.25 కోట్ల వరకు ఆదాయం వస్తుందని అధికార వర్గాలు అంచనా వేశాయి. కానీ ఆ ఆదాయం వచ్చే పరిస్థితి కనపడడం లేదు. ప్రస్తుతం జిల్లాలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కరం రూపేనా రూ.3.28 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది. జిల్లాలోని మూడు మున్సిపాలిటీలతో పాటు 535 గ్రామ పంచాయతీల్లో వచ్చిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేస్తేనే అనుకున్న లక్ష్యానికి తగ్గట్టుగా ఆదాయం వస్తుందని ఆయా శాఖల అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన చేసే కమిటీల అధికారులకు ఎలాంటి బాధ్యతలు చెప్పకుండా అదేపని ఉండేటట్లు చూడాలని, సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమిస్తే దరఖాస్తులు పూర్తిస్థాయిలో పరిష్కారం అవుతాయి.

ప్రతి ఒక్కరూ అటవీ ప్రాముఖ్యతను తెలుసుకోవాలి

కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

మాచారెడ్డి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ అటవీ ప్రాముఖ్యతను తెలుసుకోవాలని, మొక్కలను సంరక్షించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాల్లో భాగంగా, ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా మాచారెడ్డి రిజర్వ్ ఫారెస్ట్, చుక్కాపూర్‌లో వనదర్శిని కార్యక్రమంను మాచారెడ్డి హైస్కూల్ విద్యార్థులతో మాచారెడ్డి రేంజ్ పరిధిలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అటవీ ప్రాముఖ్య గురించి విద్యార్థి దశ నుంచి తెలుసుకోవడంతో పాటు ప్రతీ విద్యార్థి ఒక్కో మొక్కను నాటి సంరక్షించుకోవాలని తెలిపారు. ప్రత్యక్షంగా నేర్చుకున్న విషయాలను తోటి విద్యార్థులకు వివరించాలని తెలిపారు. పర్యావరణ సమతుల్యం కావడానికి అడవుల పెంపకం అవసరమని తెలిపారు. అనంతరం డీఎఫ్‌వో నిఖిత మాట్లాడుతూ ఆహారపు గొలుసు సరిగా ఉండాలంటే వృక్షాలు, వన్యప్రాణి ఎంతో అవసరమని అన్నారు. అడవిలో మంటలు చెలరేగకుండా అటవీ సంపదను కాపాడేందుకు సిబ్బంది పలు జాగ్రత్తలు తీసుకోవడం, అప్రమత్తంగా ఉండడం జరుగుతుందని తెలిపారు. భవిష్యత్ తరాల వారికి అటవీ సంపదను అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దివ్య, డీపీవో శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో గోపి బాబు తదితరులు పాల్గొన్నారు.

హాకీ సామగ్రి అందజేత

కామారెడ్డి టౌన్ : గర్గుల్ మన ఊరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.25 వేల హాకీ క్రీడా సామగ్రిని గర్గుల్ పాఠశాల విద్యార్థులకు కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా ఆసక్తిని పెంచడంతో పాటు క్రీడాకారులను పెంచేదిశగా ఫౌండేషన్ సభ్యులు కృషి చేయడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సురేష్‌రెడ్డి, సలహాదారులు భీంరెడ్డి, రాజ్‌కుమార్ రెడ్డి, ప్రభాకర్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీ మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు సామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



భిక్కనూరు సౌత్ క్యాంపస్‌లో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భిక్కనూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్ అన్నారు. బుధవారం క్యాంపస్ ఆవరణలో మాదకద్రవ్యాల నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ముద్రించిన వాల్‌పోస్టర్లను ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు అలవాటు పడితే ఆర్థికంగా, శారీరకంగా, మానసికంగా చాలా నష్టం జరుగుతుందన్నారు. వాటికి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరీ, ఎన్ఎస్ఎస్ అధికారులు అంజయ్య, హరిత, సిబ్బంది పాల్గొన్నారు.



కామారెడ్డిలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ ఐక్యవేదిక సభ్యులు

‘హిందువులు ఐక్యతతో ముందుకు సాగాలి’

కామారెడ్డి టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జేపీఎస్ విగ్రహం వద్ద నుంచి కొత్త బస్టాండ్ వరకు హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక ప్రతినిధులు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువులపై రోజు ఏదో ఒక చోట దాడులు జరుగుతునే ఉన్నాయని ఇలాంటివి భవిష్యత్తులో పెరగొద్దు అంటే హిందువులు అందరూ ఐక్యంగా ఉండాలని అన్నారు. హిందువుల సంఖ్య రోజు రోజుకూ తగ్గుతుందని భవిష్యత్తు తరాల కోసం ఒక్కో జంట ముగ్గురు పిల్లలను కనాలని అన్నారు. ఇప్పుడు హిందువులు ఐక్యంగా లేకపోతే దేశవిభజన నాటి పరిస్థితులు పురావృతం అవుతాయని అన్నారు. కరోనా సమయంలో బంగ్లాదేశ్‌లో అనేక సహాయక చర్యలు చేపట్టడమే కాక వేలమందికి అన్నం పెట్టే ఇస్కాన్ సంస్థను బంగ్లాదేశ్ ప్రభుత్వం నిషేధించాలని చూస్తుందని అన్నారు. నోబెల్ అవార్డు గ్రహీత యూసఫ్ పాలనలో హిందువులపై దాడులు ఎక్కువయ్యాయని ఆయన నోబెల్ అవార్డును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హిందూ ఐక్యవేదిక నాయకులు శివకుమార్, మాజీ ఎంపీ బీబీ పాటిల్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, నాయకులు మురళీధర్‌గౌడ్,నీలం చిన్నరాజులు, పైడి ఎల్లారెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీకాంత్, భరత్, ప్రవీణ్, భూమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బార్‌లను తలపిస్తున్న.. పర్మిట్ రూంలు!



వైన్స్ వెనుకాల రేకుల షెడ్డులో మద్యం తాగుతున్న దృశ్యం

- జిల్లాలో విచ్చలవిడిగా సిట్టింగులు
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్‌శాఖ అధికారులు
- మద్యం అమ్మకాలే లక్ష్యంగా విధుల నిర్వహణ
- నివాస గృహాల మధ్యే యథేచ్ఛగా అమ్మకాలు
- గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు

ఎల్లారెడ్డి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మద్యం షాపుల్లో ఏర్పాటు చేసిన పర్మిట్ రూమ్‌లు బార్లను తలపిస్తున్నాయి. నిబంధనలను గాలికి వదిలేసి పెద్దపెద్ద రేకులషెడ్లు వేసి బెంచీలు, బల్లాలు వేసి యథేచ్ఛగా సిట్టింగ్‌లు నడిపిస్తున్నారు. ఆయా వైన్స్‌షాపుల పక్కన వెనుకాల నివాస గృహాలు ఉన్నా కూడా పర్మిట్ రూమ్‌లను నడిపిస్తున్నారు. నిర్ణీత కొలతల ప్రకారం ఒక చిన్న గది మాత్రమే పర్మిట్ రూమ్‌లను నిర్వహించాల్సిన వైన్స్‌షాపుల యజమానులు పెద్ద ఎత్తున సిట్టింగ్‌లను నిర్వహిస్తున్నారు. ఎక్సైజ్‌శాఖ అధికారులు మాత్రం ప్రభుత్వం విధించే టార్గెట్‌ల మేరకు మద్యం అమ్మకాలపైనే దృష్టి సారిస్తున్నారు. చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పర్మిట్ రూమ్‌లో ఎలాంటి బెంచీలు గాని బల్లలు గాని వేయకుండా నిర్వహించాల్సి ఉంటుంది. కేవలం గ్లాసులు, మందు సీసాలు పెట్టుకునేందుకు మాత్రమే వాల్ చెక్కలు వేయాలి. కాని ఒక్కో వైన్‌షాప్ యజమాని పెద్దపెద్ద షెడ్లను ఏర్పాటు చేసి సిట్టింగ్‌లను నిర్వహిస్తున్నారు. ఎక్సైజ్ పోలీసుశాఖ అధికారులకు నెలనెలా మామూళ్లు ముట్టచెబుతూ బార్లను తలపించేలా పర్మిట్‌రూమ్‌లను నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సాయంత్రం అయిందంటే చాలా వైన్స్‌షాప్‌ల పర్మిట్ రూమ్‌లు బార్లను తలపిస్తున్నాయి. జిల్లాలో మొత్తం 49 మద్యం షాపులు నడుస్తుండగా 8 వరకు బార్లు ఉన్నాయి. వైన్‌షాప్ పర్మిట్ రూమ్‌లో నిబంధనలకు విరుద్ధంగా సిట్టింగ్‌లు నిర్వహిస్తూ బార్ల గిరాకీని దెబ్బ తీస్తున్నారు. ప్రతీ వైన్ షాప్‌కు ఒక పర్మిట్‌రూమ్ తప్పనిసరి. ఇందుకోసం ఏడాదికి రెండు లక్షల రూపాయలు చెల్లిస్తున్నారు. జిల్లాలో కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి పట్టణాల్లో బార్లు ఉన్నాయి. మండల పరిధిలో బార్లు లేవు.

ప్రజలకు ఇబ్బందులు

పట్టణ ప్రాంతాల్లో ప్రధాన రహదారులపైన ఉండే పలు వైన్స్‌షాపులు గల్లీలో ఉండే కొన్ని షాపుల్లో విచ్చలవిడిగా సిట్టింగ్‌లను నిర్వహిస్తున్నారు. మండలాలు కొన్ని పట్టణాల్లో ఉన్న వైన్స్‌షాపుల్లో పర్మిట్ రూమ్‌లను బార్లవలే నిర్వహిస్తున్నారు. మద్యం ప్రియులకు కావాల్సిన తినుబండారాలు, వాటర్ ప్యాకెట్లు, వాటర్ బాటిల్ గ్లాసులు ఏర్పాటు చేసి సిట్టింగ్‌ను నిర్వహిస్తున్నారు. ఈ సిట్టింగుల వల్ల మద్యం ప్రియులు విచ్చలవిడిగా మద్యం తాగుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. పెద్ద ఎత్తున సిట్టింగ్‌లు నిర్వహిస్తుండగా అక్కడ అక్కడ గొడవలు కూడా కొన్ని మండలాల్లో వైన్స్‌షాపుల పక్కనే వెనుకాల నిర్వహించే పర్మిట్ రూమ్‌లకు ఆనుకుని నివాస గృహాలు ఉన్నాయి. ఈ పర్మిట్ రూమ్‌ల్లో సిట్టింగ్‌లను నిర్వహించడం వల్ల ఆయా గృహాల్లో నివసించే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆదాయమే లక్ష్యంగా వైన్ షాపులకు టార్గెట్‌లు విధిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు నిబంధనలను పాటిస్తున్నారా లేదా అనే విషయంపై తనిఖీలు చేయడం లేదు. వైన్‌షాపుల యజమానులు నెలనెల ఇచ్చే మామూళ్లు తీసుకుని అటు వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని ఆరోపణలు ఉన్నాయి. కొన్నిచోట్ల వైన్ షాప్‌లో యజమానులు సమయపాలన పాటించడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారులు స్పందించి వైన్ షాపుల్లో పర్మిట్ రూమ్‌లను తనిఖీ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అదే విధంగా నివాస గృహాల పక్కన నిర్వహి స్తున్న పర్మిట్ రూమ్‌లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు

పంచాయితీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా ఒక్కో గ్రామంలో రెండు నుంచి మూడు వరకు బెల్టు షాపులు నిర్వహిస్తు న్నారు. అంతేకాకుండా కొన్ని గ్రామాల్లో అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. మందుబాబులు మద్యం తాగి గ్రామాల్లో రెచ్చిపోతున్నారని బెల్టుషాపుల వల్ల పేద కుటుంబాలు రోడ్డు మీద పడుతున్నాయని మద్యానికి బానిసై గ్రామాల్లో గొడవలకు దారి తీస్తున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇకనైన ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో బెల్టు షాపులను అరికట్టా లని కోరుతున్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

ఎడపల్లి, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు బుధవారం సైబర్ నేరాలు, షీ టీంలపై ఎడపల్లి పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు హాజరై విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎస్సై వంశీ కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ గంగా శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ముప్కాల్: విద్యార్థి దశ నుంచే సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ముప్కాల్ ఏఎస్సై గంగారాం అన్నారు. బుధవారం ముప్కాల్ మండల కేంద్రంలో కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కల్పించారు. ఈ సందర్భంగా మొబైల్ ఫోన్‌ల ద్వారా 80శాతం సైబర్‌నేరాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సాంకేతికతను ఆసరగా చేసుకొని సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని అవగాహన పెంచుకొని ఇటువంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్త పడాలన్నారు. తమ చుట్టు ఉన్న సమాజాన్ని కూడా జాగ్రుతం చేయాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ వినోద, కానిస్టేబుల్ సాగర్, కావేరి, సౌమ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖ పనితీరుపై..

భీమ్‌గల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ చేపడుతున్న పనితీరుపై శ్రీసరస్వతి విద్యామందిర్ పాఠశాల విద్యార్థులకు ఎస్సై మహేష్‌కుమార్ అవగాహన కల్పించారు. శ్రీ సరస్వతి విద్యామందిర్ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులకు క్షేత్రస్థాయిలో భీమ్‌గల్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎఫ్ఐఆర్ ఎస్‌హెచ్‌వో సైబర్ కేసులు, సివిల్, క్రిమినల్ కేసులపై ఎస్సై అవగాహన కల్పించారు. అనంతరం సిబ్బందిని పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయిచరణ్, శ్రీవాణి, పీఈటీ సుమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

సెల్‌టవర్ నిర్మాణం నిలిపివేయాలి

భీమ్‌గల్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని సాయిరాం నగర్‌కాలనీలో నిర్మిస్తున్న సెల్‌టవర్ నిర్మాణాన్ని వెంటనే నిలిపి వేయాలని కోరుతూ కాలనీవాసులు బుధవారం తహసీల్దార్ మహమ్మద్ షబ్బీర్, ఎస్సై మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. జనవాసాల మధ్య సెల్‌టవర్‌లు నిర్మించవద్దని ట్రాయ్ నిబంధనలకు విరుద్ధంగా కాలనీ ఇల్ల మధ్యన ఎయిర్ టెల్‌సెల్ టవర్‌ను నిర్మిస్తున్నారని దీంతో భవిష్యత్‌లో కాలనీవాసులు, చిన్నపిల్లలు అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందని కనుక సెల్‌టవర్‌ను ఇక్కడి నుంచి తరలిరావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు రఘు, రమణారెడ్డి, నిఖిల్, లావణ్య, గంగామణి, సునీత, బాగ్య, మంజుల ఉన్నారు.

వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం అందించాలి

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రైవేటు హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని పీడీఎస్‌యు జిల్లా ప్రధానకార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అన్నారు. బుధవారం పట్టణంలోని పీడీఎస్‌యు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల హాస్టళ్ళలో ఫుడ్ సెఫ్టి కమిటీలను వేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు పండ్ల పంపిణీ

వేల్పూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని కిచెన్ గార్డెన్‌లో పండిన పండ్లను విద్యార్థులకు బుధవారం ప్రధానోపాధ్యాయులు రాజేంధర్‌గౌడ్ పంపిణీ చేశారు. జులైలో నాటిన అరటి, జమ, బొప్పాయి పండ్లు కాయడంతో అరటి పండ్లకు విద్యార్థులకు పంపిణీ చేశామని హెచ్‌ఎం తెలిపారు. చెట్ల పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామన్నారు. ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన సిబ్బందికి విద్యార్థులకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ ధ్యేయం

● సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థలం పరిశీలించిన ఎమ్మెల్యే



సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్‌రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులకు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లి సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఆచన్‌పల్లిలో 33/11సబ్ స్టేషన్ నిర్మాణానికి అనువుగా ఉన్న 20గుంటల భూమిని సబ్ స్టేషన్ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అనంతరం సాలూర క్యాంప్ గ్రామంలో 33/11కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. సాలూర క్యాంప్, జాడిజమాల్‌పూర్ రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు స్థల పరిశీలన జరిపి అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. బోధన్ డివిజన్ విద్యుత్ కార్యాలయం కోసం రాకాసిపేటలో 800గజాల స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, తహసీల్దార్ విఠల్, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ చీల శంకర్, పులి శ్రీనివాస్, ట్రాన్స్‌కో డీఈ ముక్తార్ హైమద్, ఏడీఈ తోట రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహరాజ్‌కు ఎమ్మెల్యే పూజలు

బోధన్‌రూరల్: గిరిజనుల అరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్, శ్రీ రామరావు మహరాజ్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని బుధవారం బోధన్ మండలంలోని రాజీవ్‌నగర్ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ప్రత్యేక పూజల అనంతరం సంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

విద్యార్థి కుటుంబాన్ని పరామర్శ

పట్టణంలోని ఆచన్‌పల్లి ప్రాంతానికి చెందిన శివ జశ్విత్ రెడ్డి అనే విద్యార్థి ఇటీవల జిల్లా కేంద్రంలోని ప్రైవేటు కళాశాలలో మృతి చెందాడు. దీంతో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి శివ జశ్విత్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తన కుమారుడు మృతి చెందాడని తల్లిదండ్రులు భాస్కర్ రెడ్డి, శ్రావణి కన్నీటిపర్యంతమయ్యారు. కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే తన కుమారుడు మృతి చెందాడని, తమకు న్యాయం జరిగేలా చూడాలని వారు కోరారు.

తమిళనాడు పసుపు మార్కెట్‌ను సందర్శించిన
కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ

● స్టడీ టూర్‌లో భాగంగా తమిళనాడు పసుపు మార్కెట్‌ను సందర్శించిన పాలకవర్గ సభ్యులు



పసుపు మార్కెట్‌ను పరిశీలిస్తున్న పాలకవర్గ సభ్యులు

కమ్మర్‌పల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్టడీ టూర్‌లో భాగంగా తమిళనాడులోని పసుపు మార్కెట్‌గా పేరుగాంచిన సేలం, ఎరోడ్ పసుపు మార్కెట్‌ను కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ ఛైర్మన్ పాలెపు నర్సయ్య మాట్లడుతూ.. మన రైతులు, కమీషన్ ఏజంట్లు, ట్రేడర్స్ మూడు విభాగాలుగా విక్రయాలు జరుగుతాయని తమిళనాడు సేలం మార్కెట్‌లో పసుపును పండించిన రైతులు నేరుగా మార్కెట్‌కు తరలించిగా ట్రేడర్స్ అందరు ఉమ్మడిగా కూర్చొని మార్కెటిగ్ సిస్టమ్ ద్వారా రేటును నిర్ణయించి రైతుకు తెలిపే పద్ధతిన విక్రయాలు జరుగుతాయన్నారు. ప్రస్తుం క్వింటా రూ.15 వేలు దాటి ఉందని తెలిపారు. దీంతోపాటు వ్యవసాయ ఉత్పత్తులు, మద్దతు ధరలకు విక్రయించుకోవడానికి రెగ్యులెటెడ్ మార్కెట్‌కు తరలించి బిడ్డింగ్ చేసుకునే విధానం, గోదాముల్లో నిలువ ఉంచుకునే పద్ధతులు తదితర మరెన్నో విషయాలను అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. స్టడీటూర్‌లో వైస్ ఛైర్మన్ సుంకెట బుచ్చన్న, డెక్టర్‌లు బి మహిపాల్, రేక్కం సంపత్ రెడ్డి, జైడి మధులత శ్రీనివాస్, బనావత్ రాములు, లక్మ రంజీత్, కిష్ట చిన్నబాజన్న, కోరిపెల్లి లింగారెడ్డి తదితర డైరెక్టర్‌లు ఉన్నారు

టీడీపీ సభ్యత్వ నమోదుకు స్పందన

బోధన్‌రూరల్,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): బోధన్, బాన్సువాడ నియోజకవర్గాలలో తెలుగు దేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఎన్‌టీఆర్ అభిమానులు, చంద్రబాబు నాయుడు అభిమానుల నుండి విశేష స్పందన లభిస్తుందని పార్టీ జిల్లా మాజీ కార్యదర్శి విఠల్ అన్నారు. బుధవారం వర్ని మండలం శ్రీనగర్ గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. వచ్చే సంస్థాగత ఎన్నికలలో పార్టీ ఆదేశాల మేరకు పోటీలో పాల్గొంటామన్నారు. ఆన్‌లైన్‌లో సభ్యత్వం నమోదు చేసుకోవచ్చన్నారు. సభ్యత్వం చేసుకున్న వ్యక్తికి 5లక్షల రూపాయల ఇన్సూరెన్స్ సౌకర్యం ఉంటుందన్నారు. ఇప్పటికి వరకు తెలుగు రాష్ట్రాలలో 60లక్షల మంది సభ్యత్వం తీసుకున్నారని వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తిలక్, హేమంత్, సాత్విక్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాల కోసం గురువారం జిల్లా ఉపాధి అధికారి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి మధుసూదన్‌రావు తెలిపారు. మణపురం హోమ్ ఫైనాన్స్ ప్రైవేటు లిమిటెడ్, ఎంజిబి మోటార్స్ అండ్ ఆటో ఏజెన్సీస్ కంపెనీల వారు ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నారని సేల్స్ ఎగ్జిక్యూటీవ్, సేల్స్ మేనేజర్, అకౌంటెంట్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ఇంటర్, డిగ్రీ, ఎంకామ్, బీకాం, ఎంబిఏ పాసైన పురుష, మహిళ అభ్యర్థులు హాజరుకావచ్చని అన్నారు. నిజామాబాద్, బోధన్, బాన్సువాడ, భైంసా, నిర్మల్, తెలంగాణ మొత్తం పనిచేయాల్సి ఉంటుందని ఆసక్తిగల వారు ఉదయం 10.30 గంటలకు హాజరుకావాలన్నారు. వివరాలకు 9948748428, 6305743423 నెంబర్లను సంప్రదించాలన్నారు.

సారంగపూర్ ఆలయ హుండీ లెక్కింపు

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉన్న సారంగపూర్ హనుమాన్ దేవాలయ హుండీని లెక్కించారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన హుండీ లెక్కింపులో ఆలయానికి 55వేల 922 రూపాయలు ఆదాయం రాగా అందులో 53,640 రూపాయలు నోట్ల రూపంలో, 2,282 నాణెల రూపంలో ఆదాయం సమకూరింది. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీలకురాలు కమల, కార్యనిర్వాహణాధికారి ఫిట్‌పర్సన్ వేణు, ఆలయ అర్చకుడు శశికుమార్, రాందాసి, జూనియర్ అసిస్టెంట్ ప్రశాంత్ పాల్గొన్నారు.

శంభులింగేశ్వర ఆలయంలో..

ప్రసిద్ధ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న శంభులింగేశ్వర దేవస్థానం హుండీని లెక్కించారు. దేవాదాయ శాఖ పరిశీలకురాలు కమల, ఆలయ కార్యనిర్వాహణ అధికారి శ్రీరాం రవీందర్‌గుప్త ఆధ్వర్యంలో నిర్వహించిన హుండీ లెక్కింపులో 44వేల 22 రూపాయలు ఆదాయం వచ్చింది. ఆదాయంలో 38,330 రూపాయలు నోట్ల రూపంలో రాగా, 5,692 రూపాయలు నాణెల రూపంలో ఆదాయం సమకూరింది. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు దేవశర్మ, వాసు పాల్గొన్నారు.

పెద్ద రాంమందిర్..

నగరంలోని బ్రహ్మపురిలోగల బడా రాంమందిర్ హుండీని లెక్కించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీలకురాలు ఆధ్వర్యంలో జరిగిన హుండీ లెక్కింపులో ఆలయానికి 10వేల 442 రూపాయలు ఆదాయం వచ్చింది. ఇందులో 9,240 రూపాయలు నోట్ల రూపంలో రాగా, 1,202 నాణెల రూపసంలో ఆదాయం సమకూరింది. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు బ్రహ్మేశ్వర్‌కర్, శ్రీనివాస్‌చార్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ ప్లాంట్ అందజేత

బోధన్‌రూరల్,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): సాలూర మండలంలోని తగ్గెల్లి ప్రభుత్వ పాఠశాలకు బుధవారం 25వేల రూపాయల విలువ గల మినరల్ వాటర్ ప్లాంట్‌ను విద్యార్థుల సౌకర్యార్థం ఐ లవ్ షై విలేజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగేందర్ అందజేసినట్లు హెచ్‌ఎం నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ లవ్ షై విలేజ్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ ప్రభావతిలతో అశోక్, కస్తూరి, హన్మాండ్లు, విజయ లక్ష్మి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

మందిర నిర్మాణానికి విరాళం

ఎడపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్నాపల్లి గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన రేణుకా ఎల్లమ్మ దేవి మందిర నిర్మాణానికి బీజేపీ సీనియర్ నాయకులు కందగట్ల రాంచందర్ బుదవారం విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుర్నాపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆద్వర్యంలో చేపడుతున్న రేణుకా ఎల్లమ్మ దేవి ఆలయ నిర్మాణానికి తనవంతు సాయంగా 21వేల రూపాయలను విరాళంగా అందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రవీంధర్ గౌడ్, బాలరాజ్ గౌడ్, బిజేపి జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లెపూల శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు నాయిని లక్మన్ గౌడ్ తదితరులు ఉన్నారు.

అడవులు, వణ్యప్రాణుల సంరక్షణపై అవగాహన

కమ్మర్‌పల్లి, డిసెంబరు 4: (ఆంధ్రజ్యోతి) ప్రపంచ వణ్యప్రాణి దినోత్సవాన్ని పురస్కరించుకుని కమ్మర్‌పల్లి అటవీప్రాంతంలో ఎస్‌వీఎస్ పాఠశాల విద్యార్థులకు కమ్మర్‌పల్లి అటవిక్షేత్రాధికారి (ఎఫ్ఆర్‌వో) బి రవిందర్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అడవుల సంరక్షణ, పెంపకం, నీటివనరులు, పరిరక్షణ, అటవీ చట్టాలు అటవీప్రాణుల భద్రత, రక్షణ, ప్రజల బాధ్యత తదితర అంశంపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీఎస్ పాఠశాల కరస్పాండెంట్ ఏనుగు గంగారెడ్డి, కోఆర్డినేర్ జాన్ సుందర్, ఉపాధ్యాయులు నకుల్, సింపోనియా, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేత



అగ్ని ప్రమాద బాధిత కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న సునీల్‌కుమార్

మెండోర, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అగ్ని ప్రమాద సంఘటన స్థలాన్ని బుధవారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ పరిశీలించారు. మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు గృహాలు పూర్తిగా దగ్ధమై విషయం తెలిసిందే. నష్టపోయిన బాధితులకు సునీల్‌కుమార్ పరామర్శించి ధైర్యం చెప్పారు. తక్షణ సహాయం కింద రూ.10వేల నాలుగు కుటుంబాలకు అందజేశారు. బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరపున బాధితులకు డబుల్‌బెడ్‌రూం ఇళ్ల అందేలా కృషి చేస్తానని, స్థలం ఉన్న వారికి ఇందిరమ్మ పథకం కింద ఇల్లు కట్టుకునే వారికి రూ.5లక్షలు అందేలా చూస్తానని జిల్లా అధికార యంత్రాంగంతో మాట్లాడి ప్రభుత్వం తరపున అందే సహాయం తొంద రలోనే చేస్తానని తెలిపారు. అగ్ని ప్రమాదంలో కట్టుబట్టలతో సహ కాలిబుడిద అయ్యాయని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి ఆర్థిక సహాయం అందేలా చూడాలని ముత్యాల సునీల్‌కుమార్ మండల బాధిత కుటుంబసభ్యులు కన్నీటి పర్వంతమయ్యారు. ఆయన వెంట వేల్పూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, కొప్పెల మోహన్, మౌలానా, ప్రమోద్, తదితరులు ఉన్నారు.

తమను కొందరు అధికారులు వేధిస్తున్నారు

● ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన సదర్ హోమ్‌లో ఉంటున్న యువతులు

నిజామాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ నగరంలోని సదర్ హోమ్‌లో ఉంటున్న యువతులు అధికారులపై ఫిర్యాదులు చేశారు. తమను కొంత మంది అధికారులు వేధిస్తున్నారని ఉన్నతాధికారులకు లేఖలు పంపారు. వివిధ సమస్యలతో ఆశ్రయం కోసం సదర్ హోమ్‌కు వచ్చిన వారిని కొంత మంది అధికారులు సొంత పనులకు ఉపయోగించుకుంటున్నారని వారు ఉన్నతాధికారులకు పంపిన లేఖల్లో పేర్కొన్నారు. వీరి వేధింపులకు తాళలేక ఒక యువతి సదర్ హోమ్ నుంచి పారిపోయారు. ఈ హోమ్‌లో పనిచేసే ఇన్‌చార్జి కూడా ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండానే వెళ్లిపోయారు. జిల్లాలో వివిధ సమస్యలపై బాధింపబడ్డ బాధిత యువతులకు భరోసా కల్పించేందుకు ఈ హోమ్‌కు తీసుకువచ్చి ఉంచుతున్నారు. వారికి వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చి తమ సొంత కాళ్లపై నిలబడే విధంగా అవకాశాలు కల్పిస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులను ఈ హోమ్‌కు పర్యవేక్షణకు నియమించారు. ఈ హోమ్‌లో ఉంటున్న వారి కోసం డొనేషన్లను కూడా ఇస్తున్నారు. ఈ హోమ్‌లో ఉన్న యువతులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదులు అందించడంతో ప్రత్యేక అధికారి ద్వారా వివరాలను సేకరిస్తున్నారు. ఉన్నతాధికారులు తమకు భరోసా కల్పించేందుకన్న ఇంటి పనులతో పాటు ఇతర పనులు చేయించుకుంటున్నారని వారు ఉన్నతాధికారులకు పంపిన లేఖలో పేర్కొన్నారు. తమకు భరోసా కల్పించడంతో పాటు తగిన శిక్షణ అందించి స్వశక్తితో నిలబడే విధంగా చూడాలని కోరారు. ఈ విషయంపై జిల్లా మహిళా సంక్షేమ శాఖ అధికారిని రసూల్‌బీని వివరణ కోరగా అన్ని వివరాలను వెల్లడిస్తానని ఆమె తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లానని ఆమె తెలిపారు. కొంత మంది హోమ్ మూతబడుతుందనే ఉద్దేశ్యంతోనే ఈ ఆరోపణలు చేస్తున్నారని ఆమె తెలిపారు.

మెగా ఒలింపియాడ్ రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులు

పెర్కిట్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని నలంద హైస్కూల్ విద్యార్థులు ఐఐటీ మెగా ఒలింపియాడ్ రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారని యాజమాన్యం ప్రసాద్, సాగర్ తెలిపారు. ఈ అభ్యాస్ అకాడమి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షల్లో 4నుంచి 9వ తరగతికి చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించారని తెలిపారు. బుధవారం నలంద పాఠశాల ప్రిన్సిపాల్ సాగర్, కరస్పాండెంట్ ప్రసాద్ వారి తల్లిదండ్రుల సమక్షంలో సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సబ్జెక్టు ఇన్‌చార్జీ ఉపాధ్యాయుడు సతీష్, సందీప్, శ్వేత, నిఖిల, రాజశ్రీలు పాల్గొన్నారు.

జిల్లాలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుల ఎన్నిక



గైని కిరణ్

రెంజల్,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడి ఎన్నికల ఫలితాలు బుధవారం వెలువడ్డాయి. రెంజల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రెంజల్ మండల కేంద్రానికి చెందిన గైని కిరణ్ 808ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఎన్నికకు కృషి చేసిన ఎమ్మెల్యే సుదర్శన్,కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

బోధన్‌రూరల్: బోధన్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా కార్తీక్ యాదవ్, మండల అధ్యక్షుడిగా గంగోని యగ్నేష్, రెంజల్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా గైని కిరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని సాలూర కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు మందర్నా రవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరిని నియమించినందుకు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం మరింత పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మోర్తాడ్ మండలం శెట్‌పల్లి గ్రామా నికి చెందిన అడ్వాల మనోజ్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా భారీ మెజారిటీతో ఎన్నిక య్యారు. బుధవారం ప్రక టించిన ఫలితాల మేర కు 561ఓట్ల మెజారిటీతో మనోజ్ గెలుపొందారు. ఈ సందర్భంగా గెలుపొందిన మనోజ్‌ను బాల్కొ ండ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జీ ముత్యాల సునీల్ కుమార్ మండల కాంగ్రెస్ నాయకులు ముత్యాల రాములు, పుప్పాల అశోక్, మహిపాల్‌రెడ్డి, రంజిత్, దే వే ం ధ ర్ లుఅభిన ందిం చారు.అత్యధిక మెజారిటీతో గెలిపించిన మండల యువజన కాంగ్రెస్‌నాయ కు లకు, సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలు పుతై కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.



మనోజ్

మోస్రా: చందూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా సాయి సుమన్ రెడ్డి ఎన్నికయ్యారు. మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుల ఆన్‌లైన్ ద్వారా ఎన్నిక ఆగస్టు 14తేది నుండి సెప్టెంబర్ 14వరకు జరిగిన విషయం విదితమే. బుధవారం కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ఫలితాలు తెలియపరచగా సాయి సుమన్ రెడ్డి మండల యూత్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. దీంతో పలువురు నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



సాయి సుమన్‌రెడ్డి

మోస్రా: మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుల ఆన్‌లైన్ ద్వారా ఎన్నిక ఆగస్టు 14తేది నుండి సెప్టెంబర్ 14వరకు జరిగిన విషయం విదితమే. బుధవారం కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ఫలితాలు తెలియపరచగా మోస్రా మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా షేక్.ఇంతియాజ్ గెలుపొందారు. మోస్రా మండల యూత్ అధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంగా ఏనుగు రవీందర్ రెడ్డి వర్గం తరపున శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు షేక్.ఇంతియాజ్ మాట్లాడుతూ తన గెలుపుకు సహకరించిన మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి, నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదములు తెలిపారు.



ఇంతియాజ్

నవీపేట: మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా చిన్నదొడ్డి ప్రవీణ్ కుమార్ ఎన్నికయ్యారు. ఇటీవల ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎన్నికలలో చిన్నదొడ్డి ప్రవీణ్ కుమార్ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు పార్టీ నాయకులు తెలిపారు. అలాగే మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా భీమర్తి మోహన్, ప్రధాన కార్యదర్శిగా సాయిరాంలు ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అభినందించారు.

వర్ని: వర్ని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బుధవారం హర్ష అత్యధిక మెజారిటీతో విజయం సాధించారు.ఏనుగు రవీందర్ రెడ్డి ప్యానల్ తరఫున హర్షబరిలో నిలిచారు. హర్ష విజయం పట్ల కాంగ్రెస్ పార్టీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.



హర్ష

మిట్టపల్లిలో హుండీని ఎత్తుకెళ్లిన దొంగలు

డిచ్‌పల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మిట్టపల్లి గ్రామ శివారులోగల శ్రీకృష్ణ మందిరం ఆలయంలోకి చొరబడి తాళం ధ్వంసం చేసిన దొంగలు నగదు ఉన్న హుండీని ఎత్తుకెళ్లినట్లు ఆలయ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. డిచ్‌పల్లి పోలీసులు ఆలయాన్ని సందర్శించి సీసీ కెమెరాలను బాగు చేసుకోవాలని సూచించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్మూర్ ఆర్టీసీ డిపోను సందర్శన

పెర్కిట్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ ఆర్టీసీ డిపోను నూతన ఆర్‌ఎం జోత్స్న బుధవారం సందర్శించారు. ఆర్మూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ రవికుమార్ ఆమెకు స్వాగతం పలికారు. మెదక్ డిప్యూటీ ఆర్‌ఎంగా విధులు నిర్వహించి నిజామాబాద్ ఆర్‌ఎంగా నియమితులయ్యారు. ఆర్టీసీ డిపోను సందర్శించిన ఆర్‌ఎం బస్టాండ్ ఆవరణ, డిపో ఆవరణలో కలియతిరిగి పరిశీలించారు. సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపోలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం సరస్వతి, శంకర్, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

టెస్కో ద్వారా చేనేత వస్త్రాలపై 40 శాతం డిస్కౌంట్

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఈనెల 9 వరకు టెస్కో ఆధ్వర్యంలో అన్ని చేనేత వస్త్రాలపై 40 శాతం డిస్కోట్ అమ్మకాలు నిర్వహించనున్నట్లు కరీంనగర్ డిఎంవో జనార్దన్ ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్‌లోని ఆర్పీరోడ్‌లోగల టెస్కో విక్రయశాలలో అన్ని చేనేత వస్త్రాలపై 40 శాతం డిస్కౌంట్‌తో అమ్మకాలు చేయడం జరుగుతుందని కొనుగోలు దారులు చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బోధన్‌రూరల్,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): సాలూర మండల సమీపంలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయని రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. సమాచారం అందుకున్న 108సిబ్బంది చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆయన తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేసి విచారణ చేపడుతున్నామన్నారు.

దొంగతనం కేసులో నిందితుడికి జైలు

జక్రాన్‌పల్లి, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్రాన్‌పలి తాండాలో గత ఆగస్టు నెలలో బానవత్ నరేష్ ఇంట్లో దొంగతనాకి పాల్పడిన పడకల్ గ్రామానికి చెందిన కోనేటి నరేష్‌కు బుధవారం ఆర్మూర్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వేముల దీప్తి నిందితునికి ఐదు నెలల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు. దొంగతనానికి పాల్పడిన పడకల్ గ్రామానికి చెందిన కోనేటి నరేష్‌కు ఆర్మూర్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వేముల దీప్తి ఐదు నెలలు జైలు శిక్ష విధించారని ఎస్సై తెలిపారు.

బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా క్రీడాకారుడు

సుభాష్‌నగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారుడు శశిధర్ ఎంపి కైనట్లు నిజామాబాద్ జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అధ్యక్ష కార్యదర్శులు మానస గణేష్, బి.శ్యామ్‌లు తెలిపారు. కర్నాటక రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో శశిధర్ తెలంగాణ రాష్ట్ర జట్టుకు పాల్గొం టారని తెలిపారు. ఈనెల 1 నుంచి 4 వరకు ఏఎస్‌రావునగర్ హైదరా బాద్‌లో జరిగిన శిక్షణ శిబిరంలో ప్రతిభకనబర్చి తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడని తెలిపారు.

బోర్‌మోటర్ కేబుళ్ల చోరీ



స్టాటర్‌లో వైర్లను కట్ చేసి ఫ్యూజ్‌లను తొలగించిన దృశ్యం

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ యానంగుట్ట వద్ద వ్యవసాయ భూముల్లోని సుమారు వంద బోర్‌మోటర్‌ల కేబుళ్లను గుర్తుతెలియని దొంగలు చోరీ చేశారు. బుధవారం తమ వ్యవసాయ భూముల్లో పంటకు నీరు పారించడానికి రైతులు వచ్చే సరికి స్టాటర్‌లో వైర్లను కట్ చేసి ఫ్యూజ్‌లను తొలగించి బోర్‌మోటర్ వైర్లను దొంగిలించినట్లు గుర్తించారు. పలుమార్లు దొంగలు విద్యుత్ మోటర్ల కేబుళ్లు, విద్యుత్ మోటర్‌లను సైతం ఎత్తుకొని పోయిన సంఘటనలు ఉన్నాయి. గతంలో చోరీ విద్యుత్ మోటర్‌లు, కేబుల్ వైర్లను కొనుగోలు చేసే వ్యాపారిని రైతులు పట్టుకొని పోలీసులకు అప్పగించడంతో కొన్ని రోజుల పాటు కేబుళ్ల చోరీ తగ్గింది. తిరిగి ఈ మధ్యనే దొంగలు కేబుళ్ల చోరీకి పాల్పడుతున్నారు. పోలీసులు దొంగలను పట్టుకొని తమకు నష్టం జరుగకుండా రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహించాలని రైతులు కోరారు.

ఎత్తొండలో మొరం తవ్వకాలను అడ్డుకోవాలి

కోటగిరి,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలంలోని ఎత్తొండ గ్రామంలో గత నాలుగు రోజులుగా అక్రమ మొరం తవ్వకాలు జరుగుతున్నాయని బీజేపీ మండల అధ్యక్షులు వేముల నవీన్ ఆరోపించారు. కోటగిరి మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎత్తొండ గ్రామంలో గుట్టను అక్రమార్కులు పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఇష్టారాజ్యంగా తవ్వి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మొరం తవ్వకాలను ప్రోత్సహిస్తున్నారని ఈ విషయమై ప్రశ్నిస్తే ఎవరికైనా చెప్పుకోండి అంటూ దాబయిస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారులు స్పందించి మొరం అక్రమ రవాణాను అడ్డుకోవాలని కోరారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రి పర్యటన వాయిదా

నిజామాబాద్‌అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటన వాయిదా పడింది. గురువారం జరగాల్సిన మంత్రి పర్యటన ఆఖరి నిమిషంలో వాయిదా పడింది. జిల్లా కేంద్రంలో అధికా రులతో సమీక్ష, వివిధ ప్రారంభోత్సవాలు, పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొనేందుకు మొదట షెడ్యూల్ విడుదల కాగా పబ్లిక్ మీటింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లుకూడా చేశారు.మంత్రి పర్యటన వాయిదా పడగామళ్లీ ఎప్పుడు వచ్చేది త్వరలో వెల్లడించనున్నట్లు తెలుస్తుంది.

తాగునీటి సమస్యపై రాస్తారోకో

కోటగిరి,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): గ్రామంలో వారం రోజులుగా తాగునీటి సమస్య తలెత్తిన అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతుంది. రుద్రూరు మండలంలోని అక్బర్‌నగర్ గ్రామంలో బుధవారం గ్రామస్థులు రుద్రూరు, వర్ని ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. ప్రధానరహదారిపై ముళ్ల కంపలు, ద్విచక్ర వాహనాలు అడ్డంగా పెట్టి పెద్ద ఎత్తున రాస్తారోకో చేశారు. రోడ్డుపై బైఠాయించి అధికారులకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో వారం రోజుల నుండి తాగునీటి సమస్య తలెత్తిన పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదన్నారు. తాగునీటి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసి ఫలితం లేకుండా పోయింది. మండల ప్రత్యేక అధికారి సంతోష్ సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు రాస్తారోకోను విరమించారు.

శిథిలావస్థలో జూనియర్ కళాశాల



వరండాలో చదువుకుంటున్న విద్యార్థులు



జూనియర్ కళాశాల గోడలకు పాకురుపట్టిన దృశ్యం

- పిప్రి బాలుర కళాశాలలో పగిలిన రేకులు, విరిగిన కిటికీలు
- వరండాల్లో , చెట్ల కింద కొనసాగుతున్న చదువులు
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పిప్రి రోడ్డులో బాలుర జూనియర్ కళాశాల శిథిలావస్థకు చేరింది. 1965 అక్టోబర్ 19న ఉమ్మడి రాష్ట్రంలో నాటి రెవెన్యూ శాఖ మంత్రి ఎస్.రాంచంద్రారెడ్డి సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలకు భూమిపూజ చేసి కళాశాలను ప్రారంభించగా అప్పటి నుంచి ఇంటర్, డిగ్రీ కళాశాలలో కలిసి ఉండేవి. సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలుగా ఎందరో విద్యాభ్యాసాన్ని పొంది మంచి స్థానాల్లో స్థిరపడ్డారు. గడిచిన కొన్నాళ్ల తర్వాత సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలు విడిపోయి 1996లో ఇంటర్ కళాశాల, డిగ్రీ కళాశాలలుగా ఏర్పడ్డాయి. తదనంతరం డిగ్రీకళాశాలకు నూతన భవంతిని నిర్మించగా ఇంటర్ కళాశాల మాత్రం పట్టించుకునే నాథుడు లేక పాత భవంతిలో కొనసాగుతుంది. ఒకప్పుడు ఇంటర్ కళాశాలలో సీటు పొందాలంటే విద్యార్థులు నానా అవస్థలు పొందేవారు. గడిచిన కాలానుగుణంగా ఇంటర్‌లో విద్యానభ్యాసించడానికి కళాశాలలో సీటు సమస్యలు లేవు. కానీ పాత భవనం కారణంగా విద్యార్థులు వెనుకడుగు వేస్తున్నారు. ఇదే కళాశాలలో ఇంటర్ విద్యను అభ్యసించిన వారు ఎందరో ఉన్నత ఉద్యోగంలో ఉండగా మరికొందరు రాజకీయాల్లో ఉన్నత పదవుల్లో ఉన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ హాస్టళ్లలో ఉండి ఇంటర్ అదే కళాశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. కళాశాలలో హెచ్ఈసీ, సీఈసీ, ఎంపీసీ బైపీసీ కోర్సులు ఉండగా సుమారు 300మంది విద్యార్థులను విద్యను అభ్యసిస్తుండగా పాత కట్టడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గోడలకు పాకురు పట్టి ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితుల్లో భవనం ఉండగా కొన్ని క్లాసు రూం లో పైన రేకులు పగిలిపోయి కిటికీల డోర్‌లు విరిగిపోయాయి. అలాగే కళాశాల చుట్టూ చెట్ల పొదలు ఏపుగా పెరిగి విద్యార్థులకు దోమల బెడద ఎక్కువైంది.. దీంతో విద్యార్థులకు కళాశాల వరండాల్లో, చెట్ల కింద చదువును కొనసాగిస్తున్నారు. ఎప్పుడు ఏ విషపురుగు గాని, పాములు గాని క్లాసురూంలోకి వస్తాయోనని భయభ్రాంతులకు గురవుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం..

- విజయేందర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్



జూనియర్ కళాశాల స్థితిగతులపై నూతన భవనం నిర్మాణం కోసం ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరు కాగానే పాత భవనానికి మరమ్మతులు లేదా నూతన భవన నిర్మాణం చేపట్టి విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తాం.

కళాశాల ఆవరణలో చెట్ల కిందే చదువుకుంటున్న విద్యార్థులు





కళాశాలలో పైకప్పు రేకులు విరిగిన దృశ్యం



విరిగిన కిటికీలు

రాష్ట్రస్థాయిలో క్రీడాకారులు ప్రతిభ చాటాలి

- సుద్దపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నళిని

డిచ్‌పల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి మహిళల బేస్‌బాల్ పోటీలో క్రీడాకారులు చక్కని ప్రతిభ కనబర్చాలని సుద్దపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నళిని అన్నారు. బుధవారం జిల్లా బేస్‌బాల్ జట్టు ఎంపిక కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ నెల 7 నుంచి 9 వరకు రాష్ట్రస్థాయి బేస్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు జరుగనున్నాయని ఈ పోటీలో జిల్లా జట్టు మంచి ప్రతిభ కనబర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు జ్యోత్స్న, శ్రీలత, కోచ్ మౌనిక పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి బేస్‌బాల్ చాంపియన్ షిప్‌కు ఎంపికైన క్రీడాకారులు వీరే

వాలీబాల్ క్రీడల్లో సత్తా చాటిన బాల్కొండ క్రీడాకారులు

ముప్కాల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజుల క్రితం జిల్లా స్థాయి ఇంటిగ్రేటెడ్ హాస్టల్ విద్యార్థులకు బోధన్‌లో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో బాల్కొండ ఉన్నత పాఠశాల హాస్టల్ విద్యార్థిని విజేతలుగా నిలిచినట్టు ఎంఈవో బట్టు రాజేశ్వర్ తెలిపారు. బుధవారం బాల్కొండ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులకు ఎంఈవో రాజేశ్వర్ అభినందించారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి రాణించడంతో పాఠశాలకు మరింత పేరు తీసుకురావాలని క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



బాల్కొండలో క్రీడాకారులను అభినందిస్తున్న ఎంఈవో రాజేశ్వర్

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక



రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన జిల్లా బాలబాలికల జట్టు

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొనే జిల్లా బాలబాలికల జట్లను బుధవారం మగ్గిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఎంపిక చేశారు. ఎంపిక పోటీలకు 60 మంది బాలురు, 25మంది బాలికలు వివిధ జూనియర్ కళాశాలల తరపున పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ చూపిన 12మంది బాలికలు, 12మంది బాలురను జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-19 వాలీబాల్ జట్లుకు ఎంపిక చేసినట్టు ప్రధానోపాధ్యాయురాలు హరిత, వ్యాయమ ఉపాధ్యాయుడు మధు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 10నుంచి మహబూబ్‌నగర్ జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి అండర్-19 ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి గంగారెడ్డి, రాజ్ కుమార్, యాదగిరి, శ్రీనివాస్, అనుష, నిఖిత, రాజేందర్, భూపతి, సురేష్ పాల్గొన్నారు.



భీమ్‌గల్‌లో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో స్వామి

విద్యార్థులకు క్రీడా పోటీలు

భీమ్‌గల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల హెచ్‌ఎం, ఇన్‌చార్జీ ఎంఈవో స్వామి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లింబాద్రి, రఘువాస్, వాసుదేవ్, శివ, మురళీ, రాములు, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు ఇప్పించండి

- మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకుల ఆవేదన • పట్టించుకోని పాలకులు, అధికారులు



మోపాల్‌లో మధ్యాహ్న భోజనం వండుతున్న నిర్వాహకులు

మోపాల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులకు ఆరు నెలల నుంచి బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో కూడా సరైన సమయంలో బిల్లులు రాకపోవడంతో కొంత మంది ఏజెన్సీలను మాని వేసుకున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పిల్లలకు మాత్రం మధ్యాహ్న భోజనాన్ని వండి పెడుతున్నామని వారు పేర్కొన్నారు. తమకు ఎన్ని ఇబ్బందులున్నా మధ్యాహ్న భోజనాన్ని మాత్రం ఆపడం లేదన్నారు. విద్యార్థులకు మంచి ఆహారాన్ని అందిస్తున్నామన్నారు. సరైన సమయంలో బిల్లులు రాకపోవడంతో కొంత మంది ఏజెన్సీ నిర్వాహకులు వాటిని మూసి వేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. మరికొంత మంది బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి ఏజెన్సీలను నడుపుతున్నామని తెలిపారు. మోపాల్ మండలంలో 21 గ్రామ పంచాయతీలు ఉండగా కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ జెడ్పీ హెచ్ఎస్ పాఠశాలలు, మరికొన్ని గ్రామాల్లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఒక్కోక్క పాఠశాలలో 50 నుంచి 100కు పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇదిలా ఉండగా బోర్గాం(పి), ముదక్‌పల్లి, మంచిప్ప, మోపాల్, బాడ్సి, న్యాల్‌కల్, కులాస్‌పూర్ జెడ్పీ హెచ్ఎస్‌లో అనేక మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరందరికీ తాము మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నామని తెలిపారు. తమ బిల్లుల విషయంలో ఉన్నతాధి కారుల దృష్టికి కూడా తీసుకొచ్చామని పలు ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను అర్థం చేసుకొని తమ బిల్లులను తొందరగా వచ్చే విధంగా చూడాలని కోరారు. ఇదిలా వుండగా మండలంలోని కొన్ని గ్రామాల్లో మధ్యాహ్న భోజనం చేస్తున్న వారికి గ్యాస్ పొయ్యి లేకపోవడంతో కట్టెల పొయ్యి మీద వంట చేస్తున్నారు. వీరి దీన గాథ వింటేనే అనేక మంది చలించిపోవాల్సి వస్తుంది. వర్షాకాలంలో వీరు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. పాలకులు, అధికారులు ఎన్నో సార్లు ప్రభుత్వ పాఠశాలలను తనిఖీలు చేస్తుంటారు. కానీ మేము ఎదుర్కొంటున్న ఇబ్బందులను పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు గ్యాస్ పొయ్యి, సిలిండర్‌లను సరఫరా చేసే విధంగా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఇసుక అక్రమ డంపుల నిల్వాలపై చర్యలేవీ?

- ఎడపల్లిలో భారీగా ఇసుక అక్రమ డంపుల నిల్వలు • చోద్యం చూస్తున్న అధికారులు

ఎడపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎన్ని ప్రభుత్వాలు మారినా అక్రమ వ్యాపారస్థుల ఆగడాలకు అడ్డూ, అదుపు లేకుండా పోయాయి. ఒకవైపు ప్రభుత్వం ఎన్నో నిబంధనల మధ్య ఇసుక అనుమతులు ఇస్తున్నా, అక్రమ ముసుగులో ఇసుక వ్యాపారం చేస్తున్న వారి ఆటలు సాఫీగా సాగుతున్నాయనడానికి ఎడపల్లి మండలంలోని పలుచోట్ల భారీగా పేరుకుపోయిన ఇసుక డంపులే నిదర్శనం. ఎడపల్లి మండలంలో గత కొంతకాలంగా కొన్ని ప్రాంతాలను ఎంపిక చేసుకుని అక్కడ బోధన్ ప్రాంతం నుంచి వాగులు, వంకల నుంచి దొంగచాటున ఇసుకను రవాణా చేస్తూ డంపులలో నిల్వ చేస్తున్నారు. ఏమని ప్రశ్నించిన వారికి ఇళ్ల నిర్మాణాల కోసం ఇసుకను తరలించామనే సాకుతో తప్పించుకుంటున్నారు. ఇందుకు ముఖ్య కారణం అటు నిజామాబాద్, బోధన్ ప్రధాన రహదారిలో అతి సమీపంలో ఈ మండలం ఉండడం ఈ అక్రమ ఇసుక వ్యాపారస్థులకు కాసుల పంట కురిపిస్తుంది.

• గుట్టుగా కొనసాగుతున్న మామూళ్ల దందా

ఎడపల్లి మండలంలోని ఈ అక్రమ ఇసుక డంపుల వ్యాపారాన్ని కొందరు రాజకీయ నేతల అండదండలతో సాఫీగా సాగిస్తున్న ఈ వ్యాపారస్థులు నెలనెలా అటు సంబంధిత శాఖ అధికారులను ఇటు పోలీసులను మచ్చిక చేసుకుని వారి చేతులు తడిపి తమ అక్రమ వ్యాపారాన్ని మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్న చందంగా కొనసాగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

• సామాన్యుడికి భారంగా ఇసుక

సొంతగూడు నిర్మించుకోవాలనే కల నెరవేర్చుకునే క్రమంలో ఇంటి నిర్మాణం చేపట్టిన సామాన్య ప్రజలకు ఇసుక రవాణా భారంగా మారింది. అధిక ధర చెల్లించి దళారుల నుంచి కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఇదే ఈఅక్రమ ఇసుక వ్యాపారులకు కలిసొచ్చినట్లు అయ్యింది. ఇప్పటికైనా మండలంలోని ప్రధాన రహదారి పక్కన పలు చోట్ల ఉన్న ఇసుక డంపులను స్వాధీనం చేసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా అక్కడక్కడా పలుచోట్ల పలుసార్లు అధికారులు పట్టుకున్న ఇసుక డంపులను, టిప్పర్‌లను రాజకీయ నేతల ఒత్తిడితో తూతూ మంత్రంగా నామమాత్రపు జరిమానా విధించి ఇసుకతో సహా టిప్పర్‌లను వదిలివేస్తున్నారు.



ఎడపల్లిలో నిల్వ చేసిన ఇసుక డంపులు



పోలీసులు పట్టుకున్న ఇసుక టిప్పర్‌లు (ఫైల్)

ఆంధ్రజ్యోతి

వేములవాడ బస్సు సర్వీసును సద్వినియోగం చేసుకోండి

బాన్సువాడ టౌన్, డిసెంబరు 4: బాన్సువాడ నుంచి వేములవాడ నడిచే బస్సు సర్వీసును ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డిపో మేనేజర్ సరితాదేవి కోరారు. ప్రతీరోజు ఉదయం 8.30 గంటలకు బాన్సువాడ నుంచి వేములవాడకు, తిరిగి మధ్యాహ్నం 3.15ని.లకు వేములవాడ నుంచి బాన్సువాడకు బయలుదేరుతుందన్నారు. ఈ బస్సు సర్వీసు ఈ నెల 10 వరకు కొనసాగుతుందన్నారు.

ఇంగ్లీష్ బోధకులకు దరఖాస్తుల ఆహ్వానం

మద్నూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఇంగ్లీష్ బోధించేందుకు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేక అధికారి తెలిపారు. సీఆర్‌టీ పోస్టుకు గాను డిగ్రీ, బీఎడ్, టెట్ అర్హత కలిగిన నిరుద్యోగులు ఈనెల 5న సాయంత్రం వరకు మద్నూర్ కస్తూర్బా గాంధీ పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

మంత్రి జూపల్లి పర్యటన 7కు వాయిదా

మద్నూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మద్నూర్ మండల కేంద్రానికి రానున్న మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటన వాయిదా పడినట్లు అధికారులు వెల్లడించారు. మండల కేంద్రంలో మంజూరైన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భూమి పూజ 5న జరగనున్న దృష్ట్యా రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు రానున్నట్లు ప్రకటించారు. అనివార్య కారణాల వల్ల ఈనెల 7న శనివారం నాటికి వాయిదా పడింది. మద్నూర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ శంకుస్థాప నకు 7న వస్తారని తెలిపారు. అదే రోజున మద్నూర్ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లడించారు.

సీఎం కప్పును విజయవంతం చేయాలి

తాడ్వాయి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్పు క్రీడలను ప్రతీ గ్రామంలో విజయవంతం చేయాలని మండల అభివృద్ధి అధికారి సయ్యద్ అలీ అన్నారు. ఈయన బుధవారం మండల కేంద్రంలో సీఎం కప్ నిర్వహణ అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో మండల, జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న సీఎం కప్పును ప్రతీ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రహీముద్దీన్, ఎంపీవో సవితారెడ్డి, ఎంఈవో రామస్వామి, ఆయా మండలాల ప్రధానోపాధ్యాయులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ, వాలీబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

గాంధారి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ అండర్ 14 బాలుర విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పేట్‌సంగెంలో 9వ తరగతి చదువుతున్న భూక్యా అర్జున్, 8వ తరగతి చదువుతున్న బస్సి అర్జున్‌లు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కుమారస్వామి తెలిపారు. గత నెల 7,8,9 తేదీల్లో యాదాద్రి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభకనబరిచిన భూక్యా అర్జున్, బస్సి అర్జున్‌లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 10 నుంచి మహారాష్ట్రలోని అమరవతిలో జరిగే పోటీలకు తెలంగాణ రాష్ట్రం తరపున, ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో జరిగే వాలీబాల్ పోటీలకు వీరు ఇరువురు పాల్గొంటారని తెలిపారు.

కొనసాగుతున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ కొనసాగుతున్నట్లు వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు తెలిపారు. 26 రోజులుగా 69,276 టన్నుల చెరుకు క్రషింగ్ నిర్వహించి 60,200 బస్తాల చక్కెర ఉత్పత్తి చేశామన్నారు. రోజుకు 3,600 టన్నుల చెరుకు క్రషింగ్ నిర్వహిస్తూ 3,400 బస్తాల చక్కెర ఉత్పత్తి చేస్తున్నామని తెలిపారు. క్షేత్రస్థాయి సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ చెరుకు నాటిన తేదీ ప్రకారం పర్మిట్లను అందజేస్తు చెరుకు ఫ్యాక్టరీకి తరలించే విధంగా కృషి చేయాలన్నారు. రైతులు తమకు కేటాయించిన పర్మిట్ల ప్రకారం ఎలాంటి ఇబ్బందులు లేకుండా చెరుకు తరలించి ఈ సీజన్ క్రషింగ్ ప్రశాంతంగా కొనసాగే విధంగా తోడ్పాటు అందించాలని కోరారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఇన్‌చార్జి ఎంపీడీవో

పెద్ద కొడప్‌గల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటేపల్లి తండాలో గల పోలింగ్ కేంద్రాన్ని బుధవారం మండల ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో పంచాయతీ ఎన్నికలు జరగనున్న దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు పరిశీలించామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రాథమిక సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. అనంతరం కాటేపల్లి గ్రామ పాఠశాల ఆవరణలో గల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కాటేపల్లి గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ప్రదీప్, ఇమ్రాన్, నాయకులు మొగులా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



అడవుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఆర్‌వో వాసుదేవ్

అడవుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన

నాగిరెడ్డిపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలన విజయోత్సవంలో భాగంగా మండలంలోని ధర్మారెడ్డి రిజర్వు ఫారెస్టులో మండల అటవీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం వనదర్శిని కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు అడవి సంరక్షణ గురించి, వన్య ప్రాణాల సంరక్షణ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని సిద్దార్థ జూనియర్ కళాశాల విద్యార్థులకు ధర్మారెడ్డి అడవి ప్రాంతానికి తీసుకెళ్లి విద్యార్థులకు అడవి సంరక్షణ గురించి, అడవుల ప్రాముఖ్యత గురించి, అడవులకు నిప్పు పెట్టడంతో జరిగే అనర్థాల గురించి వాటి నివారణ చర్యల గురించి స్థానిక ఫారెస్టు రేంజ్ అధికారి వాసుదేవ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. చెట్లను నరకడం వల్ల జరిగే అనర్థాలు, మొక్కలు నాటడం ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే వన్యప్రాణి సంరక్షణ దినోత్సవం సందర్భంగా వన్యప్రాణుల సంరక్షణ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల ఫారెస్టు రేంజ్ అధికారి వాసుదేవ్, ఫారెస్టు బీట్ అధికారులు నవీన్, సమ్రీన్ తదితరులు పాల్గొన్నారు.

గాంధారి: మండలంలోని రేంజ్ పరిధిలో బుధవారం వనదర్శిని కార్యక్రమంను ఎఫ్ఆర్‌వో హేమచందన్ నిర్వహించారు. రాంపూర్ గడ్డం, పేట్ సంగెం అటవీ ప్రాంతంలో అడవులపై ప్రత్యేకంగా ప్రభుత్వం చేపడుతున్న వనరక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అడవులను కాపాడుకుంటే వచ్చే ప్రయోజనాల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ చెట్లను కాపాడితే భావి తరాలకు ఉపయోగపడుతాయని చెట్లతోనే మనుషులకు మనుగడ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పరమేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ హామీలతో ప్రజలు మోసపోయారు'

మాచారెడ్డి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో ప్రజలు మోసపోయారని బీజేపీ మండల అధ్యక్షుడు సురేష్ అన్నారు. బుధవారం పాల్వంచ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ 6 అబద్దాలు.. 66 మోసాలు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు అమలు కాని హామీలను ఇచ్చిందని ఇప్పటికీ వితంతు పింఛన్, ఇందిరమ్మ ఇల్లు, గృహజ్యోతి, 500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు రూ.2500 భృతి ఇలా అనేక హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కిషన్‌గౌడ్, వంశీ, నరేష్, కళ్యాణ్, రవిచంద్ర గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం



రేషన్ దుకాణంలో బియ్యం తూకం వేస్తున్న ఎమ్మెల్యే తోట

పెద్ద కొడప్‌గల్/బిచ్కుంద, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు స్పష్టం చేశారు. బుధవారం జుక్కల్, కాస్లాబాద్, బిచ్కుందలో 49 సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమేష్ దేశాయ్, సాయాగౌడ్, వెంకట్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో సన్న బియ్యం పంపిణీ

రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం అందజేస్తామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు తెలిపారు. బుధవారం మండలంలోని పోచారం గ్రామంలో రేషన్ దుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు రేషన్ దుకాణాల ద్వారా సరుకులు అందజేస్తామని తెలిపారు. రేషన్ డీలర్లు సరులకు పంపిణీ చేయడంలో ఎలాంటి అవకతవకలు లేకుండా సరులు పంపిణీ చేయాలని సూచించారు.

అయ్యప్ప దీక్ష పవిత్రమైంది

మద్నూర్: అయ్యప్ప దీక్ష ఒక పవిత్రమైన కార్యమని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పెద్దతడ్గూర్ అయ్యప్పతో కలిసి భిక్ష స్వీకరించారు. అనంతరం వారితో మాట్లాడుతూ పరమ పవిత్రమైన కార్తీక మాసంలో ఏ గ్రామంలో చూసిన అయ్యప్ప స్వాములతో కలకలలాడుతున్నాయని, ఎక్కడ విన్న అయ్యప్ప శరణు ఘోష మారుమోగుతుందని గుర్తు చేసుకున్నారు. ఆయనతో పాటు తడుగూరు అయ్యప్ప స్వాములు హన్మాండ్లు, రాజు, విశ్వనాథ్, మాజీ సర్పంచ్‌లు హన్మాండ్లు, విఠల్ గురూజీ, కాంగ్రెస్ నాయకులు సాయిలు, హన్మాండ్లు, స్వామి, రామ్ పటేల్ తదితరులు ఉన్నారు.

8న జిల్లా స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ ఎంపికలు

కామారెడ్డి టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8న ఇందిరాగాంధీ స్టేడియంలో స్త్రీ, పురుషులకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రణజిత్‌మోహన్, ప్రధాన కార్యదర్శి నరేష్ తెలిపారు. ఈ పోటీల్లో 30 ఏళ్ల దాటిన స్త్రీ, పురుషులు పాల్గొనవచ్చన్నారు. 100, 200, 400, 800, 1500, 5000, 10,000 మీటర్ల పరుగు, 5 వేల మీటర్ల నడక, హైజంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్‌త్రో, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన వారిని జనవరిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు.

బీర్కూర్‌లో నాస్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన ఎంఈవో



బీర్కూర్‌లో పరీక్ష కేంద్రం తనిఖీ చేస్తున్న ఎంఈవో

బీర్కూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యాసన, ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాలను అంచనా వేసేందుకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (నాస్) పేరుతో బుధవారం విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. బీర్కూర్ మండల కేంద్రంతో పాటు కిష్టాపూర్, బరంగేడ్గి గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో 3వ, 6వ తరగతి విద్యార్థులకు బుధవారం నాస్ పరీక్షలు జరిగాయి. అయితే ఎంఈవో వెంకన్న పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో రాణించాలి



దోమకొండలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు

దోమకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివరామ్ మందిర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని భవిత విలీన విద్యా కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏంఈవో విజయ్ కుమార్ మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులు ఆత్మస్థైర్యంతో రాణించాలని, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అందిపుచ్చుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పన్యాల శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు ప్రభావతి, సంతోష్ కుమార్, నాగరాజు, దామోదర్, రాజశేఖర్, దినేష్, విమల, విశాల, రమ, నందు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ

లింగంపేట, డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): లింగంపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన 21మంది ఆడ బిడ్డలకు ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రూ.24లక్షల 36వేలు కల్యాణ లక్ష్మీ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి అందజేశారు. మండలంలోని లింగంపేట, కొండాపూర్, ముంబాజీపేట, జల్దిపల్లి, రాంపూర్, మెంగారం, బోనాల్‌లతో పాటు పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నారాగౌడ్, నాయకులు ఎల్లమయ్య, అశోక్, నాగరాజు, రాజు, నగేష్, పూల్‌సింగ్, గోపాల్, కుర్మ సాయిలు ఉన్నారు.

యువతి అదృశ్యం



వందన (ఫైల్)

ఎల్లారెడ్డి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచాపూర్ గ్రామానికి చెందిన భైరం వందన సోమవారం సాయంత్రం పెళ్లి బట్టలు కొనడానికి వెళ్తున్నానని, అటు నుంచి డ్యూటీకి వెళ్లానని చెప్పి అదృశ్యమైనట్లు ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేష్ తెలిపారు. గత మూడేళ్ల నుంచి వందన కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తుంది. ఆసుపత్రిలో పనిచేస్తున్న వందనను కలవడానికి ఆసుపత్రికి కుటుంబ సభ్యులు వెళ్లగా వందన ఆసుపత్రికి రాలేదని సిబ్బంది తెలపడంతో వారు ఆమెకు ఫోన్‌చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల బంధువుల దగ్గర వెతికినా ఎలాంటి ఆచూకి లభించక పోవడంతో వందన తల్లి ప్రేమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడు తున్నట్లు ఎస్సై బొజ్జ మహేష్ తెలిపారు.

విద్యార్థులు అటవీ సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖ అధికారులు

ఎల్లారెడ్డి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అటవీ సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలని అటవీ శాఖ రేంజ్ అధికారి ఓంకార్ అన్నారు. బుధవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో వనదర్శిని కార్యక్రమం ద్వారా అటవీ సంరక్షణ వన్యప్రాణాలు సంరక్షణ ఆవశ్యకత గురించి అవగాహన ఏర్పాటు చేశారు. అనంతరం ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు అటవీ సంరక్షణపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు తమవంతు మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తేసే కుట్ర చేస్తుంది: బీసీ విద్యార్థి సంఘం

కామారెడ్డి టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తేసే కుట్ర చేస్తుందని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు ఆరోపించారు. బుధవారం బీసీ వసతి గృహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ.5 వేల కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలు చెల్లించకుండా ఎత్తివేసే కుట్రలు చేస్తే సహించేది లేదన్నారు. ప్రభుత్వ గురుకుల, కస్తూర్బా, సంక్షేమ హాస్టళ్లలో 1200 మంది విద్యార్థులు కల్తీ భోజనం తిని అస్వస్థతకు గురయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్, దయాకర్, ప్రవీణ్, నిరంజన్, యోగేష్, సచిన్ పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఆటలపోటీలు



బీర్కూర్‌లో దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

బీర్కూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం బీర్కూర్ మండల కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు ఆటాపోటీలు నిర్వహించారు. భవిత సెంటర్‌లో విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించి అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకన్న, ఎంపీడీవో భానుప్రకాష్, ఎంపీవో మహబూబ్, దత్తుబాబు, సాయిలు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

ఎల్లారెడ్డి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్ల తండాకు చెందిన బాత్రుత్ సావిత్రికి చెందిన ఆవు బుధవారం ఉదయం గ్రామ శివారులోని మేతకు వెళ్లగా అదే సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు ప్రమాదవశాత్తు తగలడంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందిందని తెలిపారు. ఆవు విలువ రూ.45 వేలు ఉంటుందని గ్రామ శివారులో విద్యుత్ శాఖ అధికారులు నష్ట పరిహారం అందించాలని, బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. వెల్లుట్ల గ్రామ శివారులో విద్యుత్ వైర్లు కిందకి వేలాడుతున్నాయని ట్రాన్స్‌ఫార్మర్లు కూడా ప్రమాదకరంగా తక్కువ ఎత్తులో ఉన్నాయని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు పేర్కొన్నారు.

గురుకుల పాఠశాలల పరిశీలన

ఎల్లారెడ్డి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల మైనారిటీ గురుకుల పాఠశాలలను బుధవారం టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ హరీష్ స్థానిక నాయకులతో కలిసి పాఠశాల ఆవరణ విద్యార్థులకు అందుతున్న మెనూను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గురుకులాలపై శ్రద్ధ చూపి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని డిమాండ్ చేశారు.



బోర్లం మైనారిటీ గురుకుల పాఠశాలలో కూరగాయలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

విద్యార్థినుల పట్ల నిర్లక్ష్యం చేయొద్దు

● బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గురుకులాల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినుల పట్ల ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు నిర్లక్ష్యం చేయొద్దని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి హెచ్చరించారు. బాన్సువాడ మండలం మైనారిటీ గురుకుల పాఠశాలలో విద్యార్థినుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని పౌష్టికాహారం అందడం లేదని, వసతుల కల్పన లేదని, సబ్ కలెక్టర్ కిరణ్మయికి కాంగ్రెస్ నాయకులు గత రెండు రోజుల క్రితం వినతిపత్రాన్ని అందజేశారు. దీంతో బుధవారం సబ్ కలెక్టర్ కిరణ్మయి బోర్ల మైనారిటీ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు వండుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అదేవిధంగా తరగతి గదుల్లో విద్యార్థినులతో ముచ్చటించి సౌకర్యాల కల్పన విద్యా బోధన, మధ్యాహ్న భోజనం వంటి విషయాలపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం పట్ల నిర్లక్ష్యం కూడా వహించవద్దని.. మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని తెలిపారు. మరోసారి గురుకుల పాఠశాల విద్యార్థులు వస్తే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

ఐడీసీఎంఎస్ గోదాం నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలి

బాన్సువాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలో ఇతర ప్రాంతాల్లో ఐడీసీఎంఎస్ గోదాం నిర్మాణాల కోసం పది ఎకరాల ఖాళీ స్థలాన్ని కేటాయించాలని బుధవారం బాన్సువాడ ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సబ్ కలెక్టర్ కిరణ్మయికి ఐడీసీఎంఎస్ చైర్మన్ బాదావత్ తారాచంద్ నాయక్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాన్సువాడ పట్టణంలో గల ఐడీసీఎంఎస్ సంఘం మూడు ఎకరాల 16 గుంటల స్థలంలో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం చేపట్టడం జరిగింది. ఈ స్థానంలో కామారెడ్డి జిల్లాలో ఏ ప్రాంతంలోనైనా 10 ఎకరాల ఖాళీ స్థలంను ఐడీసీఎంఎస్‌కు కేటాయించి ఇప్పించి రైతుల సంక్షేమం కోసం రైతుల సౌకర్యార్థం కోసం ఈ స్థలంలో గోదాంలు, సీడ్ ప్లాంట్‌లను, మార్కెట్ యార్డు ప్లాట్ ఫారం నిర్మాణం చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు.

కౌన్సిలర్ పదవికి రాజీనామా



ఆర్డీవోకు రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న సత్యనారాయణ

ఎల్లారెడ్డి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ బుధవారం తన కౌన్సిలర్ పదవికి రాజీనామా చేశారు. నా వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేసినట్లు రాజీనామా పత్రాన్ని ఆర్డీవో మన్నె ప్రభాకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలు ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్‌గా పని చేసిన సమయంలో ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదని ఎన్నో అభివృద్ధి పనులు చేశానన్నారు. తాను మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలోనే పని చేశానని కొన్ని కారణాల వల్ల బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లాల్సి వచ్చిందన్నారు. ప్రస్తుతం తాను కాంగ్రెస్ పార్టీ కోసమే పని చేస్తున్నానని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సూచనల మేరకు పార్టీ కోసం పని చేసి ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రామ్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సామెల్, పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వానివి 6 అబద్దాలు.. 66 మోసాలు

దోమకొండ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్‌రెడ్డి పాలనపై బుధవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో చార్జిషీట్ విడుదల చేసినట్లు మండలాధ్యక్షుడు మద్దూరి భూపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్, రైతు భరోసా, మహిళలకు ఇస్తానన్న రూ. 2500, కల్యాణలక్ష్మి, తులం బంగారం హామీలు ఇచ్చి అమలుకు నోచుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు కొత్తగా ఒక్క పింఛన్, రేషన్ కార్డులను మంజూరు చేయక కాలయాపాన చేస్తుందన్నారు. నిరుద్యోగులకు రూ. 4 వేల నిరుద్యోగ భృతి ఏమైందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, నర్సింలు, అనుపాటి నరేందర్‌రెడ్డి, కంది మనోజ్ కుమార్, శ్రీనాథ్, సచిన్, సిద్ధరాములు, గాజులపల్లి విఠల్‌రెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

శనగ పంట పరిశీలన

రాజంపేట,డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలంలోని ఆర్గొండ గ్రామంలో బుధవారం ఏవో శృతి శనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాసంగి శనగ పంటను పూతకాయ దశలో ఆశించే శనగ పచ్చపురుగు నివారణ తొలిదశలో వేప నూనె 5మి.లీ నీటికి, పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు స్పైనోసాడ్ లేదా క్లోరిన్ ట్రినిలిప్రోల్ మందును 0.3 ఎంఎల్ లీటర్ నీటికి 60 ఎంఎల్ ఎకరానికి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు శ్రీశైలం, సంతోష్, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం అందించాలి

కామారెడ్డి టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలను అందించాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అక్టోబరులో ఆశా వర్కర్లు సమ్మెకు వెళితే కమిటీ వేస్తామని, ఆశల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఇప్పటికీ పరిష్కారం చూపలేదన్నారు. వెంటనే ఆశాలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు, పారితోషికాల్లో సగం పెన్షన్ అందించాలన్నారు.

మెడికల్ కళాశాలకు మరణానంతరం పార్థివదేహం అప్పగింత



నర్సింలు దంపతులను సన్మానిస్తున్న వైద్య బృందం

కామారెడ్డి టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తన మరణం తర్వాత దేహం మట్టిలో కలిసిపోయి వృథాగా పోవడం కంటే వందల మంది నిపుణులైన వైద్యులను తయారు చేసేవిధంగా మరణాంతరం తన దేహాన్ని కళాశాలకు ఇచ్చేందుకు ముందుకు వచ్చే వారి ఆలోచన గొప్పదని జిల్లా జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ ఫరీదా అన్నారు. మంగళవారం కామారెడ్డి జీజీహెచ్ ఆసుపత్రిలో తన మరణాంతరం మెడికల్ కళాశాలకు పార్థివ దేహం అప్పగించేందుకు సిద్ధమైన టీటీపేట మండల కేంద్రానికి చెందిన పోస్టల్ శాఖలో పని చేసి రిటైర్ అయిన నక్క నర్సింలు అతని సతీమణి సుగుణని సన్మానించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థుల పరీక్ష నిమిత్తం దానంగా తన పార్థీవదేహాన్ని ఇవ్వడానికి ముందుకు వచ్చి వాగ్దానం చేసిన నర్సింలు ఎందరికో స్ఫూర్తి దాయకమని అన్నారు. ఆయన అందించే పార్థివ దేహ దానం మానవత్వం గల మరో పది మంది ముందుకు వచ్చేలా చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	- రోటి కప్‌డా రోమాన్స్
దర్శన్	- ఝూన్సీ ఐపీఎస్
ప్రియా 35	- అమరన్
ప్రియా 70	- మెకానిక్ రాకి

బాన్సువాడ

మహేశ్వరి	- పుష్ప-2
వెంకటేశ్వర	- ఝూన్సీ

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

